క్లుప్తంగా

10న జాబ్‌మేళా

ఇల్లెందు: నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశం కల్పించేందుకు హరిప్రియ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10న ఇల్లెందులో జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. గురువారం ఇల్లెందులో ఫౌండేషన్ చైర్మన్ హరిసింగ్ నాయక్ మాట్లాడుతూ.. టాస్క్ కలర్ స్కై టెక్నాలజీస్ సహకారంతో ఇల్లెందులోని ఫౌండేషన్ భవన్‌లో ఉదయం 10 గంటల నుంచి జాబ్‌మేళా ప్రారంభం అవుతుందని తెలిపారు. నిరుద్యోగులు పదోతరగతి ఆ పైచదువులు చదువుకున్న వారు ఈ జాబ్ మేళాకు హాజరు కావచ్చన్నారు. కార్యక్రమంలో పరుచూరి వెంకటేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ సిలివేరు సత్యనారాయణ, చెరుపల్లి శ్రీనివాస్, సయ్యద్ జానీపాషా, మనోహర్ తివారీ, తాతా గణేష్, గంగావత్ లక్ష్మణ్, వరప్రసాద్, గిన్నారపు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణ్‌కు ఆచార్యదేవోభవ అవార్డు


అవార్డు అందుకుంటున్న లక్ష్మణ్

పాల్వంచ: ట్రస్మా జిల్లా అధ్యక్షుడు, పాల్వంచ శ్రీ సిద్ధార్థ హైస్కూల్ కరస్పాండెంట్ బండి లక్ష్మణ్ ఆచార్యదేవోభవ అవార్డు వరించింది. బుధవారం హైదరాబాద్ మాధాపూర్ హైటెక్స్‌లో జరిగిన ట్రెయిన్ ఫీడ్ ఎడ్యు లీడర్ పురస్కారాల్లో భాగంగా విద్యారంగానికి మూడు దశాబ్దాలుగా చేస్తున్న కృషికి గుర్తింపుగా బండి లక్ష్మణ్‌కు అవార్డు దక్కింది. పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి కిరణ్‌కుమార్‌రెడ్డి, ట్రస్మా అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, నీసా జాతీయ అధ్యక్షుడు శర్మల చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించండి

పాల్వంచరూరల్: గ్రామాల్లో ప్రతిఒక్కరూ విరివిగా మొక్కలు నాటి కాలుష్యాన్ని నివారించి పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడాలని దంతలబోరు ఎస్సీకాలనీ పంచాయతీ సర్పంచ్ గద్దల రమేష్ కోరారు. దంతలబోరు ఎస్సీ కాలనీ పంచాయతీలో గురువారం సర్పంచ్ పుట్టినరోజు సందర్భంగా వార్డు సభ్యులతో కలిసి వంద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ శంకర్, ఉపసర్పంచ్ వెంకటనర్సమ్మ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నర్సరీల నిర్వహణపై శ్రద్ధ చూపాలి

ఇల్లెందురూరల్: గ్రామపంచాయతీలలో నర్సరీల నిర్వహణ పక్కాగా ఉండాలని ఎంపీడీఓ అప్పారావు సూచించారు. మండలంలోని బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీలో నర్సరీని గురువారం ఆయన తనిఖీ చేశారు. బ్యాగ్ ఫిల్లింగ్ పనులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాలలో ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా నర్సరీలలో మొక్కలు పెంచేందుకు ప్రాధాన్యమివ్వాలని చెప్పారు. క్రమం తప్పకుండా ప్రతిరోజూ నర్సరీని సందర్శించి మొక్కల సంరక్షణపై శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి షర్మిల, సిబ్బంది పాల్గొన్నారు.

వామపక్షాలు ఐక్యం కావాలి

సింగరేణి(కొత్తగూడెం): మతోన్మాద శక్తులను ఓడించటానికి వామపక్ష ప్రజాతంత్ర శక్తులు ఐక్యం కావాలని మాజీ పార్లమెంట్ సభ్యులు మీడియం బాబురావు పిలుపునిచ్చారు. స్థానిక మంచికంటి భవన్‌లో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొక్కెర్లపాటి పుల్లయ్య అధ్యక్షతన గురువారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ రెండోసారి అధికారంలోకి వచ్చాక మతవిద్వేశాలు రెచ్చగొడుతూ ప్రజలను విచ్ఛిన్నం చేస్తోందని విమర్శించారు. దేశానికి మతోన్మాద ప్రమాదం పొంచి ఉందని బీజేపీ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, సీనియర్ నాయకులు కాసాని అయిలయ్య, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య పాల్గొన్నారు.

మాణిక్‌రావ్ ఠాక్రే నియామకంపై హర్షం


స్వీట్ తినిపించుకుంటున్న నాయకులు

కొత్తగూడెంరూరల్: కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా మణిక్‌రావ్ ఠాక్రే నియామకంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కొత్తగూడెంలోని పార్టీ కార్యాలయంలో గురువారం నాయకులు రాయల శాంతయ్య, పట్టణ అధ్యక్షుడు బొమ్మిడి మల్లికార్జున్ ఆధ్వర్యాన కేక్ కట్ చేసి మాట్లాడారు. వివిధ మండలాల అధ్యక్షులు, నాయకులు అంతోటి పాల్, సకినాల వెంకటేశ్వరరావు, పల్లపు వెంకటేశ్వర్లు, కొప్పుల రమేష్, కల్లేపల్లి రాజా, వెలేటి వెంకటేశ్వర్లు, అక్బర్, కలిపాక సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారులు

- దమ్మపేట సెంటర్ నుంచి శ్రీనివాస కాలనీ వరకు అడుగుకో గుంత
- దెబ్బతింటున్న వాహనాలు.. నిత్యం ప్రమాదాలు
- దుమ్ముతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు


గుంతలతో ప్రమాదకరంగా అంబేడ్కర్ సెంటర్

పాల్వంచ: పాల్వంచ నుంచి ములకలపల్లికి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. దమ్మ సెంటర్ నుంచి శ్రీనివాసకాలనీ వరకు ఈ గుంతలు ఎక్కువగా ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతల్లో ప్రయాణంతో వాహనాలు దెబ్బతింటున్నాయి. అంతేకాకుండా ఈ గుంతలు ప్రమాదాలకు నిలయంగా మారాయి. దుమ్ముధూళి వెనక వచ్చే వాహనదారులకు ఇబ్బందిగా ఉంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. ఇదిలా ఉండగా బీసీఎం రహదారిలో అంబేడ్కర్ కూడలి ప్రమాదకరంగా మారింది. గుంతలు ఎక్కువగా ఉండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

రోడ్డుపై గుంతలతో సతమతం..

పాల్వంచ నుంచి ములకలపల్లి, దమ్మపేట మీదుగా రాజమండ్రి వరకు నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పాల్వంచ మీదుగా వెళ్లే వాహనదారులు ఈ గుంతల వల్ల సతమతం అవుతున్నారు. ద్విచక్ర వాహనదారుల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారిందని ప్రయాణికులు వాపోతున్నారు. కొన్నినెలలుగా ఈ రోడ్డు దుస్థితి ఇలా ఉండటంతో నిత్యం స్థానికులు సామాజిక మాధ్యమాల్లో ఈ రోడ్డు దుస్థితి వైరల్ అవుతోంది. పాలకులు, అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా శివనగర్, తెలంగాణనగర్, గుట్ట మూలమలుపు, శ్రీనివాసకాలనీ సమీపంలో గుంతలు మరింత ఎక్కువగా ఉన్నాయి. ముందుకెళుతున్న వాహనం వెనక మరో వాహనం వెళ్లాలంటే


ఎక్సైజ్ ఆఫీస్ వద్ద దెబ్బతిన్న రోడ్డు

ప్రాణసంకటంగా మారిందని ఆందోళన చెందుతున్నారు. అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వాహనదారుల పరిస్థితి దారుణం



ములకలపల్లికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ప్రతి ఏటా వర్షాకాలంలో ఇదే పరిస్థితి ఉంటుంది. చిన్న గుంతలు ఉన్న సమయంలోనే రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేయక పోవడం అవి పెద్దవిగా మారుతున్నాయి.

– బరగడి దేవదానం, స్థానికులు

అధికారులు స్పందించాలి



పాల్వంచ మీదుగా ములకలపల్లి, దమ్మపేట మండలాలకు నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రోడ్డు సరిగా లేక అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు తక్షణం స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలి. ఈ రోడ్డున పలువురు అధికారులు వచ్చిపోతున్నా పట్టించుకోవడం లేదు.

– నాగరాజు, పాల్వంచ

రోడ్డు మంజూరయింది



పాల్వంచ నుంచి ములకలపల్లి వెళ్లే దారిలో రోడ్డు దెబ్బతిన్న చోట మరమ్మతులు చేస్తున్నాం. ఇటీవల కొత్త రోడ్డు రెన్యూవల్ వర్క్ కోసం రూ.1.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. కిన్నెరసాని రోడ్డు విస్తరణ పనులు ప్రస్తుతం నడుస్తున్నాయి. ఫిబ్రవరిలో దమ్మపేట సెంటర్ నుంచి మూడు కిలోమీటర్ల రోడ్డు పనులు చేపడతాం.

– వంశీ, ఆర్‌అండ్‌బీ ఏఈ

ఏళ్లు గడుస్తున్నా.. అమలు కాని హామీలు

జూలూరుపాడు: 7న ఏన్కూర్‌లో జరిగే ఏఐవైఎఫ్ వైరా నియోజకవర్గ స్థాయి జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు పగడాల అఖిల్, ఎస్కే చాంద్‌పాషా పిలుపునిచ్చారు. గురువారం జూలూరుపాడులో జరిగిన ఏఐవైఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా అమలు చేయలేదని విమర్శించారు. సీపీఐ జాతీయ నాయకుడు బాగం హేమంతరావు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శులు పోటు ప్రసాద్, ఎస్కే సాబీర్‌పాషా హాజరుకానున్న జనరల్ బాడీ సమావేశానికి పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఏఐవైఎఫ్ జిల్లా సమితి సభ్యుడు ఎస్కే సమీర్, పసుపులేటి పవన్, కొట్టె నరేష్ పాల్గొన్నారు.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు


మాట్లాడుతున్న రవీంద్ర నాయక్

జూలూరుపాడు: తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని మాజీ ఎంపీ, బీజేపీ వైరా అసెంబ్లీ పాలక్ ధరావత్ రవీంద్ర నాయక్ అన్నారు. గురువారం జూలూరుపాడులో జరిగిన బీజేపీ శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌ల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మాట్లాడుతూ.. ఈ నెల 7వ తేదీన ప్రతి అసెంబ్లీ కేంద్రంలో పోలింగ్ బూత్ సభ్యుల సమ్మేళనం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సమ్మేళనంలో ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వర్చువల్‌గా ప్రసంగిస్తారన్నారు. ప్రతి పోలింగ్ బూత్ నుంచి కమిటీ సభ్యులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. అంతకుముందు రవీంద్ర నాయక్‌ను బీజేపీ నాయకులు, కార్యకర్తలు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చిలుకూరి రమేష్, విద్యాసాగర్, శ్యామ్ రాథోడ్, నున్నా రమేష్, నెల్లూరు కోటేశ్వరరావు, భూక్యా శ్రీను, సిరపురపు ప్రసాద్, భూక్యా రాజేష్, భూక్యా రమేష్, కంచి సోమయ్య, భూక్యా రవి, వందనపు సుబ్బు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సహపంక్తి భోజనాలు చేద్దాం రండి..

సూపర్‌బజార్(కొత్తగూడెం): గతంలో వన భోజనాలు అంటే పండగ వాతావరణం.. విందు భోజనాలు, ఆటపాటలతో గడిపేవారు. కానీ రాను రాను వన భోజనాల స్థానంలో కుల భోజనాలు వచ్చాయి. ఈ పరిస్థితిలో రాజ్యాంగ పరిరక్షణ వేదిక పేరుతో కొంతమంది ప్రముఖులు వన భోజనాలకు పూర్వవైభవం తెచ్చేందుకు నడుం బిగించారు. కుల భోజనాలు కాదు.. సహపంక్తి భోజనాల పేరిట ఈనెల 8వ తేదీన జిల్లా కేంద్రంలోని సూపర్‌బజార్ సెంటర్‌లో సహపంక్తి భోజనాలు చెద్దాం రండి.. నినాదంతో కార్యక్రమాన్ని రూపొందించారు. ఇందులో ఎక్కువ మందికి అవకాశం కల్పించాలనే ఉద్దేశ్యంతో దూరంగా తోటలలో కాకుండా జనసమ్మర్థం ఉండే సూపర్‌బజార్ సెంటర్‌లో నిర్వహించనున్నారు. ఈ మేరకు గురువారం కరపత్రాలు ఆవిష్కరించారు. నిర్వాహకులు మల్లెల రామనాథం మాట్లాడుతూ.. రాజ్యాంగ హక్కుల రక్షణ వేదిక కులభోజనాలను ఎదిరించేందుకే ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు చెప్పారు. అందరూ విజయవంతం చేయాలని కోరారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రతిపక్ష కౌన్సిలర్లపై వివక్ష తగదు

సింగరేణి(కొత్తగూడెం): ప్రతిపక్ష పార్టీల కౌన్సిలర్ల పట్ల వివక్ష తగదని, కౌన్సిలర్లను అవమానిస్తే ప్రజలను అవమానపరిచినట్లేనని కొత్తగూడెం మున్సిపల్ సీపీఐ పక్ష నాయకుడు వై.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రొటోకాల్ విస్మరించడంపై వివాదాలు చోటుచేసుకునే అవకాశం ఉండటంతో సీపీఐ 16వ వార్డు కౌన్సిలర్ మాచర్ల రాజకుమారిని, పట్టణ సహాయ కార్యదర్శి మాచర్ల శ్రీనివాస్‌ను పోలీసులు గురువారం ముందస్తుగా అరెస్ట్ చేసి 3వ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీపీఐ కౌన్సిలర్లు, నాయకుల బృందం అరెస్టయిన నాయకులను పరామర్శించి, స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. పట్టణంలో రోడ్ల నిర్మించనున్నారని ఇందులో భాగంగా సీపీఐ కౌన్సిలర్ల వార్డులోని శిలాఫలకంలో వారి పేరు ఎందుకు ముద్రించలేదని ప్రశ్నించారు. ఈ విషయంపై అధికారులను నిలదీస్తారని వారి ఆదేశాలతోనే అరెస్ట్ చేసినట్లు ఆరోపించారు. నిరసనలో కౌన్సిలర్లు కంచర్ల జమలయ్య, భూక్య శ్రీనివాస్, విజయ్‌కుమార్, పి.సత్యనారాయణచారి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి ఇక్కట్లు


చేను వద్ద నీళ్లు పట్టుకుంటున్న గ్రామస్తులు

సుజాతనగర్: వేసవి ఇంకా ప్రారంభం కాలేదు.. కానీ సింగభూపాలెం గ్రామంలోతాగునీటి ఇక్కట్లు మొదలయ్యాయి. గ్రామంలోని 9, 10వ వార్డుల్లో కొంతకాలంగా నీటి సరఫరా లేకపోవడంతో సుమారు 50 దళిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి సమస్య ఇంతలా వేధిస్తున్నా ఏ ఒక్క అధికారి కానీ, ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీరికి సమీపంలోని రెండు చేతిపంపులు మరమ్మతులకు గురై రోజులు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మిషన్ భగీరథ నీళ్లు కూడా రెండు మూడు బిందెల కంటే ఎక్కువ రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి కోసం పంట పొలాల్లోని బోరుబావుల వద్దకు వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

నేడు చండీహోమం

పాల్వంచరూరల్: మండల పరిధి కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో పౌర్ణమి సందర్భంగా శుక్రవారం చండీహోమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హోమంలో పాల్గొనే భక్తులు రూ.2,516 చెల్లించి గోత్రనామాలను నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9705479910 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

లైఫ్ సర్టిఫికెట్ రెన్యువల్ చేయండి

ఇల్లెందు: ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు, అధికారులు తమ సీపీఆర్ఎంఎస్ కార్డు రెన్యువల్ చేసుకోవాలని, లేదంటే ఉచిత వైద్య సేవలు నిలిపివేయబడతాయని ఏరియా జీఎం షాలేమురాజు తెలిపారు. గురువారం తన చాంబర్‌లో మాట్లాడుతూ.. లైఫ్ సర్టిఫికెట్ సమర్పించే ప్రక్రియ డిజిటలైజేషన్ చేయటం జరిగిందన్నారు. పెన్షన్ కోసం ఎలాగైతే జీవన్ ప్రమాణ్ పోర్టల్‌లో లైఫ్ సర్టిఫికెట్ పొందేవర్చుతామో సీపీఆర్ఎంఎస్ మెడికల్ కార్డు లైఫ్ సర్టిఫికెట్ కూడా అదే తరహాలో జీవన్ పోర్టల్‌లోనే సమర్పించవచ్చని తెలిపారు. ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగిస్తూనే ఆఫ్‌లైన్ ప్రక్రియ కూడా యథాతదంగా కొనసాగుతుందని తెలిపారు.

టీయూడబ్ల్యూజే పోస్టర్లు ఆవిష్కరణ

పాల్వంచ: ఈనెల 8, 9, 10 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న టీయూడబ్ల్యూజే (హెచ్142) మహాసభల పోస్టర్లను రాష్ట్ర రోడ్డు, రవాణాశాఖ మంత్రి పువ్వాడఅజయ్‌కుమార్ ఆవిష్కరించారు. గురువారం స్థానిక పాత పాల్వంచలోని ఎమ్మెల్యే వనమా స్వగృహం నందు ఎమ్మెల్యే వనమా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్, మున్సిపల్ చైర్మన్ కాపు సీతాలక్ష్మిలతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కల్లోజి శ్రీనివాస్, షఫీలు మాట్లాడుతూ.. మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.

అడ్డగోలుగా డ్రెయినేజీ నిర్మాణం

టేకులపల్లి: బోడు గ్రామంలో రూ.25లక్షల డీఎంఎఫ్ నిధులతో నిర్మిస్తున్న డ్రెయినేజీ పనులు అడ్డగోలుగా చేస్తున్నారు. నిర్మాణం ఒక్కో చోట ఒక్కోరకంగా ఉందని, సీసీ రోడ్డును పగులకొట్టి డ్రెయినేజీ నిర్మించడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై ఏఈ రాజును వివరణ కోరగా.. చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కారు, ఆటో ఢీ

చుంచుపల్లి: హౌసింగ్ బోర్డు బృందావనం వద్ద గురువారం కారు, ఆటో ఎదురెదురుగా ఢీ కొని ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు.. కొత్తగూడెం వస్తున్న ఆటోను ఖమ్మం వెళుతున్న కారు ఢీ కొట్టింది. ఆటోలో ఉన్న నాగుల వంచ, ఖమ్మంనకు చెందిన రాము, మదార్‌సాహెబ్ గాయపడ్డారు. వారిని కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆస్పత్రికి పంపించారు. చుంచుపల్లి పోలీసులు వివరాలు కేసు నమోదు చేసుకుని వివరాలు సేకరిస్తున్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి


క్రికెట్ టోర్నీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ, ఏఎంసీ, మున్సిపల్ చైర్మన్లు

టేకులపల్లి: యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఇల్లెందు ఎమ్మెల్యే బాణోతు హరిప్రియ, ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బాణోతు హరిసింగ్ నాయక్, ఇల్లెందు మున్సిపాలిటీ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం టేకులపల్లి హైస్కూల్ ఎదురుగా ఉన్న మైదానంలో ఏర్పాటు చేసిన హరిప్రియ కప్ సీజన్2 క్రికెట్ టోర్నమెంట్‌ను వారు ప్రారంభించారు. క్రీడాకారులకు టీషర్టులు అందజేశారు. క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యకర్మంలో సీఐ ఏలేటి ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐ భూక్యా శ్రీనివాస్, ఎంపీటీసీ భూక్యా బాలకృష్ణ, సర్పంచ్ అజ్మీర గలక, నిర్వాహకులు జాటోత్ నరేష్, టి.ప్రవీణ్, బి.సందీప్, బీఆర్ఎస్ నాయకులు, క్రీడాకారులు బాణోతు రామ నాయక్, బాణోతు కిషన్ నాయక్, అర్జున్‌రావు, ఇస్లావత్ సాయి, నోముల భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో కేసీఆర్ విఫలం


రమాకాంత్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఇఫ్టూ జిల్లా కార్యదర్శి పి.ప్రసాద్ అన్నారు. ఈ మేరకు జిల్లా గ్రామపంచాయతీ అధికారి రమాకాంత్‌కు ప్రగతిశీల గ్రామపంచాయితీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ.. గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించటంలో కేసీఆర్ విఫలమయ్యారని ఆరోపించారు. కార్మికులను పర్మనెంట్ చేస్తామని ఇప్పటి వరకు చేయలేదన్నారు. గ్రామపంచాయతీలు శుభ్రంగా ఉంచడంలో కార్మికుల శ్రమ ఎంతో ఉందన్నారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, సీఎంపీఎఫ్ సౌకర్యం కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే ఇప్పించాలని, పీఆర్సీని వెంటనే అమలు చేయాలని, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆర్.మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రమేష్, కోశాధికారి పి.సతీష్, వేల్పుల రమేష్, గౌస్, ఎర్రయ్య, లింగయ్య పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను విజయవంతం చేయాలి


సుజాతనగర్: మాట్లాడుతున్న పర్సానాయక్

సుజాతనగర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కంటి వెలుగు జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ పర్సానాయక్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం జరిగిన ఆశా డే కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కంటి వెలుగు కార్యక్రమంలో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ముందుకెళ్లాలన్నారు. గ్రామస్థాయిలో ఈ కార్యక్రమం గురించి అవగాహన కల్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కంటి సమస్యలతో బాధపడుతున్న ఎంతోమందికి ఈ కార్యక్రమం ద్వారా ప్రయోజనం కలుగుతుందన్నారు. అనంతరం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో నూతనంగా వచ్చిన వైద్యాధికారి డాక్టర్ రమేష్‌కు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

జూలూరుపాడు: ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యే రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని జూలూరుపాడు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాకేష్ కుమార్ అన్నారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో జరిగిన ఆశా డే కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు దాటిన ప్రతిఒక్కరూ కంటి వెలుగు కార్యక్రమంలో కంటి పరీక్షలు చేయించుకునేలా వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించి చైతన్య పరచాలన్నారు.

టేకులపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం ఈనెల 18 నుంచి ప్రారంభం కానుందని దీన్ని వైద్య సిబ్బంది అందరూ సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మంతెన విద్యాసాగర్ పేర్కొన్నారు. గురువారం పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లకు ఒక్కరోజు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు.

స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించండి


సీడీపీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

టేకులపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) మండల కన్వీనర్ కొండపల్లి శకుంతల కోరారు. గురువారం దేశ వ్యాప్తంగా స్కీం వర్కర్ల నిరసన కార్యక్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్కీమ్‌ల రక్షణ, స్కీమ్ వర్కర్ల హక్కుల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు సీడీపీఓ కేఎం తారను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం పీహెచ్‌సీలో ఆశా వర్కర్లతో మాట్లాడారు. ఐసీడీఎస్, ఎండీఎంఎస్, ఎన్‌హెచ్‌ఎం తదితర స్కీమ్‌ల ప్రైవేటీకరణ ఆపాలని, బడ్జెట్ పెంచి బలోపేతం చేయాలని, ఎన్ఈపీ 2020, డిజిటల్ హెల్త్ మిషన్‌ని ఉపసంహరించుకోవాలని, స్కీమ్ వర్కర్లందరినీ పర్మనెంట్ చేయాలని, 45వ ఐఎల్‌సీ సిఫారసుల ప్రకారం స్కీమ్ వర్కర్లందరికీ కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, స్కీమ్ వర్కర్లందరికీ నెలకు రూ.10వేల పెన్షన్, పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ, మొదలైన అన్ని సామాజిక భద్రతా చర్యలు అమలు చేయాలని, అన్ని రాష్ట్రాల్లోని వివిధ రకాల స్కీమ్ వర్కర్లకు ఒకే రకమైన సర్వీసు రూల్స్ ఉండాలని, 4 లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని, స్కీమ్ వర్కర్లను కార్మిక చట్టాల పరిధిలోకి తేవాలని, రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలో ఉన్న పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని తదితర డిమాండ్లతో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో శకుంతల, భద్రమ్మ, రాజేశ్వరి, సుజాత, మాధవి, హైమావతి, మంగ తాయారు, రాధ, జయమ్మ, రమేష్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

జీఎం కార్యాలయం ఎదుట ఆందోళన


ధర్నా చేస్తున్న గిరిజనులు

ఇల్లెందు: బొగ్గు లోడింగ్ అన్ లోడింగ్ లేబర్ కాంట్రాక్ట్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ సభ్యులు తమకు టెండర్లు దక్కకుండా చేస్తున్నారంటూ గురువారం ఏరియా జీఎం కార్యాలయం ప్రధాన గేట్‌కు తాళం వేసి ఆందోళన చేపట్టారు. పలు డిమాండ్లతో జీఎం షాలేమురాజుకు వినతిపత్రం అందజేశారు. కొమురం భీం గిరిజన సంఘం నాయకులు, తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి గొగ్గెల రామస్వామి మాట్లాడుతూ.. పంపు ఆపరేటర్ టెండర్ కోసం తమ సంస్థ అర్హత కలిగి దరఖాస్తు అందజేశామని తెలిపారు. అయితే డ్రా తీసి గిరిజనేతరులకు టెండర్ కట్టబెట్టారని ఆరోపించారు. ఈ విషయమై మానవ హక్కుల కమిషన్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు చెప్పారు. పలు దఫాలు జీఎం కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం దక్కలేదని దీంతో ఆందోళన చేస్తున్నట్లు పేర్కొన్నారు. నిరవధిక ధర్నా చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో తుడుందెబ్బ, సొసైటీ సభ్యులు తాటి మధు, పూనెం వెంకటేష్, పొడుగు నారాయణ, వెంకటేష్, అశోక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

బురద గుంతను పూడ్పించండి

డ్రెయినేజీలు సక్రమంగా లేకపోవడంతో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం పక్కనే ఉన్న గిరిజన బాలుర కళాశాల వసతి గృహంలోని వాడకం నీరు బయటకు వెళ్లడం లేదు. బయటికి వచ్చి రోడ్డుపైనే నిల్వ ఉంటోంది. దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి బురద గుంతను పూడ్చివేయాలని, డ్రెయినేజీ నిర్మించాలని కోరుతున్నారు.

– టేకులపల్లి



ప్రశ్నించాల్సిన అధికారి : గాంధీ, ఎంపీఓ, టేకులపల్లి
సెల్ నంబర్ : 9948169879